# సాక్షి శ్రీకాకుళం

గురువారం । 3 । ఆగస్టు । 2023




## సంపూర్ణ పోషణ..

జిల్లావ్యాప్తంగా బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. - 8లో



## చెవిటమ్మతల్లి ఆలయంలో చోరీ

తొగిరి గ్రామంలో చెవిటమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని దోచుకున్నారు. - 8లో

## త్వరలో డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే స్పాట్ వాల్యుయేషన్ పూర్తయ్యింది. 13122 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తామని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు.

## న్యూస్‌రీల్

### జిల్లాలో చురుగ్గా ఓటర్ల సర్వే



విశాఖ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ–2024 సర్వే శ్రీకాకుళం జిల్లాలో చురుగ్గా సాగుతోందని, సకాలంలో ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఓటర్ల సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం విశాఖపట్నంలో జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్వే జరుగుతున్న తీరును కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

### తీరం..అల్లకల్లోలం



కోతకు గురైన మంచినీళ్లపేట సముద్ర తీరం

వజ్రపుకొత్తూరు: మండలంలోని సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అలల పోటు ఎక్కువ కావడంతో మంచినీళ్లపేట, దేవునల్తాడ తీరంలో సముద్రం దాదాపు 120 మీటర్లు మేర ముందుకు వచ్చిందని మత్స్యకారులు చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లోని ఖేపుపరా వద్ద వాయుగుండం తీరం దాటడంతో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తీరంలో అలజడి ఎక్కువైంది. ఇసుక దిబ్బలు దాదాపు 2 కి.మీ. మేర కోతకు గురయ్యాయి. దేవునల్తాడ. అక్కుపల్లి, దిబ్బవానిపేట, కేఆర్‌పేట తదితర రేవుల్లో తీరం కోతకు గురైంది. దీంతో ఆయా ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు.

### అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్. పక్కన జేడీ సురేష్‌బాబు

శ్రీకాకుళం క్రైమ్ : రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలకు అందించే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల అమ్మకాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకూడదని జిల్లా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి (విజిలెన్స్ జేడీ) ఎ.సురేష్‌బాబు అన్నారు. బుధవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో వ్యాపారులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో విజిలెన్స్, వ్యవసాయ శాఖల అనుసంధానంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఎరువులు అందేలా చూడాలన్నారు. నిబంధనలను అతిక్రమించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, వ్యవసాయాధికారులు, వర్తకులు పాల్గొన్నారు.

### పేదలకు ఉచిత న్యాయసేవలు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులకు ఫీజు చెల్లించుకోలేని పేదలు ఈ–లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిల్ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం మొదటి అంతస్తులో ఈ– లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సెంటర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని వారికి న్యాయవాదులు చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కొమరా ఆఫీస్, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్టా అంజనీకుమార్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్ ద్వారా కేసు నడిపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, ఫణి కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనూరాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము తదితరులు పాల్గొన్నారు.

## తమ్ముళ్ల తిరుగుబాటు

# ఇక డైరెక్ట్ ఫైట్



సమావేశంలో కలమటను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్న టీడీపీ నాయకులు

- ఇన్‌చార్జి కలమటను తప్పించాల్సిందే
- 10లోగా నిర్ణయం తీసుకోవాలని అల్టిమేటం

పొలిటికల్ వాచ్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పాతపట్నం టీడీపీలో కలహాలు తీవ్రస్థాయికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి విషయంలో అధిష్టానంతో తేల్చుకోవాలని ఒక వర్గం నాయకులు డిసైడ్ అయ్యారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను పార్టీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న జరగనున్న చంద్రబాబు పర్యటనకు ముందే నిర్ణయం తీసుకోవాలని ఏకంగా అల్టిమేటం జారీ చేశారు. కలమట వెంకటరమణనే కొనసాగిస్తే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని బాహాటంగానే హెచ్చరించారు. ఇప్పుడున్న ఇన్‌చార్జి కలమట వెంకటరమణను ఎట్టి పరిస్థితుల్లో సమర్థించబోమని మెజార్టీ టీడీపీ నాయకులు తేల్చిచెప్పేశారు. ఆయన్ని తీసేసి మామిడి గోవిందరావుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కలమటపై విశ్వాసం లేదని, ఆయనతో కలిసి పనిచేయలేమని స్పష్టం చేశారు. బుధవారం మామిడి గోవిందరావు క్యాంపు కార్యాలయంలో సమావేశమై విలేకర్ల ఎదుట తమ ఆవేదన, డిమాండ్‌ను తెలియజేశారు.

**ఆసక్తికర పోరు..**

పాతపట్నం టీడీపీలో ఆసక్తి పోరు నడుస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కలమట వెంకటరమణను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తదితరులంతా సమర్థిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేది కలమటేనని బహిరంగంగా చెబుతున్నారు. ఇటీవల జరిగిన బస్సు యాత్ర సభలో కూడా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కలమట వెంకటరమణ పోటీ చేస్తారని సదరు నాయకులు ప్రకటించారు. దీంతో కలమటకు వ్యతిరేక గ్రూపుగా పనిచేస్తున్న మామిడి గోవిందరావు వర్గీయులకు మింగుడుపడలేదు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమ మాట లెక్క చేయకుండా కలమటే అభ్యర్థి అని ఎలా ప్రకటిస్తారని అసమ్మతి నాయకులంతా రగిలిపోతున్నారు. ఇంకా మౌనంగా ఉంటే మంచిది కాదని భావించి పార్టీ అగ్రనేతలతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు.

**అగ్రనేతల ప్రకటన తర్వాత..**

నియోజకవర్గ అభ్యర్థి కలమట వెంకటరమణే అని ప్రకటించిన తర్వాత బహిరంగ వేదికపైకి వచ్చి అగ్రనేతల ప్రకటనకు భిన్నంగా అసమ్మతి నాయకులు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. బుధవారమైతే విలేకర్లతో సమావేశమై కలమటపై ఉన్న అసంతృప్తిని వ్యక్తం చేయడమే కాకుండా ఆయన్ని ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తక్షణమే తప్పించాలని డిమాండ్ చేశారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న పైల బాబ్జి, యాళ్ల నాగేశ్వరరావు, ఎద్దు దాసునాయుడు, వెలమల గోవిందరావు, కాగాన మన్మధరావు, నంబాల వెంకటరావు, కోవిలాపు కృష్ణమాచారి, దశరథ, యర్లంకి తిరుపతిరావు, సనపల తిరుపతిరావు, యారబాటి బాలరాజు, సవలాపురం యల్లమ్మనాయుడు, చాపల రామారావు, బాబారావు తదితర నాయకులంతా కలమటపై ఆరోపణలు గుప్పించారు. 'కలమట నాయకత్వంపై విశ్వాసం, నమ్మకం లేదు. టీడీపీలో ఉన్న కలమట 2014లో వైఎస్సార్ సీపీలోకి వెళ్లారు. గెలిచిన తరువాత 2016లో టీడీపీలోకి మళ్లీ వచ్చారు. వచ్చాక ఏం చేశారో అందరికీ తెలుసు. కలమటతో పార్టీలు మారకుండా ముందు నుంచి ఉన్న టీడీపీ నాయకులను వేధింపులకు గురి చేశారు' అని గుర్తు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇన్‌చార్జిగా ఎంజీఆర్‌కు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు పునరాలోచన చేసుకుని, ఈ నెల 10లోగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మురిసిన మువ్వన్నెల జెండా



- శ్రీకాకుళంలో 105 అడుగుల స్థూపంపై భారీ జెండా ఏర్పాటు
- స్వాతంత్ర్య స్ఫూర్తి రగిలిస్తూ భారీ ర్యాలీ

తిరంగా ప్యారా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మువ్వన్నెల పతాకం రెపరెపలతో సిక్కోలు గడ్డ మురిసిపోయింది. గాంధీ మందిరం బృందం, ఇండియన్ ఆర్మీ కాలింగ్ ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ కూడలి నుంచి శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతివనం వరకు జాతీయ పతాకాన్ని భుజాలపై మోసుకొని ర్యాలీగా వెళ్లారు. అనంతరం గాంధీ మందిరం వద్ద ఏర్పాటుచేసిన 105 అడుగుల స్తూపానికి 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు గల జాతీయ జెండాను ఏర్పాటుచేసి ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ ఓబులేష్ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 130 కోట్ల భారతీయుల సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలిచే 105 అడుగుల ఎత్తుగల స్థూపం వద్ద జాతీయ జెండాని ఆవిష్కరించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పింగళి వెంకయ్య విగ్రహ దాతలకు, జాతీయ జెండాను మోసిన ఇండియన్ ఆర్మీ కాలింగ్ ప్రతినిధులకు మెమెంటో, శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ సభ్యులు ఎం.ప్రసాద్‌రావు, జామి భీమశంకర్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణు గోపాలరావు, బాడాన దేవభూషనరావు, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, హారికా ప్రసాద్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, మహిబుల్లా ఖాన్, నక్క శంకరరావు, ఎం.వి.ఎస్ భట్లు, గుత్తు చిన్నారావు, శాస్త్రి, పొన్నాడ రవికుమార్, తర్లాడ అప్పలనాయుడు, డీటీఓ నారాయణరావు, నిక్కు హరి సత్యనారాయణ, నిక్కు అప్పన్న, పైడి హరనాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా రెపరెపలు

## రెండో రోజుకు 90.15% పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్/లావేరు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలో రెండో రోజూ కొనసాగింది. గ్రామ, వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. బుధవారం సాయంత్రానికి జిల్లాలో 90.15 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్, ఏటీబీఎస్ దొర తెలిపారు. మొత్తం 3,11,502 పింఛన్లకు గాను 2,80,843 పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కాగా, లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన వృద్ధురాలు అన్ను బోడమ్మ అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీరు యలగాడ మాధవి బుధవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.



రిమ్స్‌లో బోడమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాధవి

## నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులు నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లకు ఓపీఆర్‌ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, ఆర్టీసీ అధికారులు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. టికెట్ చార్జీలను యూపీఐ విధానంతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చన్నారు. దూరప్రాంత ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్, రెండో డిపో మేనేజర్ కేఆర్‌ఎస్ శర్మ, కోర్ గ్రూప్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, శ్రీకాకుళం ఒకటో డిపో సిస్టం సూపర్‌వైజర్ ఇబ్రహీం, రెండో డిపో సిస్టం సూపర్‌వైజర్ హైమావతి పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర' మస్కట్, లోగో పోటీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీల మస్కట్, లోగో కోసం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ పోటీలు నిర్వహిస్తోందని జిల్లా చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. జిల్లాలో 17 ఏళ్లు పైబడిన (కళాశాల, యూనివర్సిటీ, ఐటీఐ) విద్యార్థులు పోటీల్లో పాల్గొని మస్కట్, లోగో డిజైన్ చేయాలని సూచించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. వీటితో పాటు నాన్ కాంపిటేషన్ విభాగంలో యోగా, మారథాన్, ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తామన్నారు. మస్కట్, లోగో డిజైన్ చేసిన వారికి ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30వేలు, తృతీయ బహుమతిగా రూ.20వేలను ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. పోటీదారులు వెబ్‌పోర్టల్ 'స్పోర్ట్స్.ఏపీ.జీవోవి.ఇన్'లో ఆగస్టు 7లోపు వివరాలు నమోదు చేసి మస్కట్ లోగో డిజైన్ పంపించాలన్నారు. పూర్తి వివరాలకు 98496 00463 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ట్రిపుల్ ఐటీకి సౌర విద్యుత్



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌కు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు. 750 కిలో వాట్స్ విద్యుత్ సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు బుధవారం నెడ్‌క్యాప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యుత్ ఆదా చేయటంలో భాగంగా సౌర విద్యుత్‌పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. వర్సిటీలో భవిష్యత్తులో 6400 మంది విద్యార్థులు ఉంటారని, టీచింగ్, నాన్ టీచింగ్ సైతం వేల సంఖ్యలో ఉంటారని అన్నారు. అన్ని బ్లాక్‌లకు సౌర విద్యుత్ సరఫరా లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ సంస్థ ప్రతినిధి నాగార్జున రెడ్డి, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

## నిజాయితీగా పనిచేసినప్పుడే గుర్తింపు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- డీసీఎంఎస్ చైర్మన్‌గా గొండు కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం



డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తిని అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: నిజాయితీగా పనిచేసినప్పుడే ప్రజలు గుర్తిస్తారని, జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలో పనిచేసే అధికారులు, సిబ్బంది అవినీతికి తావులేకుండా పనిచేసి సంస్థను పురోభివృద్ధిలో నడపాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం డీసీఎంఎస్ చైర్మన్‌గా గొండు కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ జిల్లా సహకార సంఘ అధ్యక్షునిగా, /అంపోలు కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా గొండు పనిచేశారని, అవినీతి లేని రాజకీయం ఆయనకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. గతంలో పదవుల పంపకంలో కులం, మతం చూసే వారని, ఇప్పుడు నీతి, నిజాయితీలే ప్రామాణికాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, ఎంపీపీ గొండు రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకులు గురుగుబెల్లి లోకనాథం, ఎం.రఫీ, కోణార్క్ శ్రీను, ముంజేటి కృష్ణ, పీస శ్రీహరి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## 8 నుంచి యోగ శిక్షణ తరగతులు




శ్రీకాకుళం కల్చరల్: ఆనందమయ జీవితానికి ఆనందోత్సవం పేరిట ఈ నెల 8 నుంచి 13 వరకు యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ డీజీసీ సభ్యులు బి.వి.రవిశంకర్ బుధవారం తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలోని పెద్దపాడు రోడ్డు, అరసవల్లి మిల్లు కూడలి వద్ద ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆరురోజుల పాటు ధ్యానం తరగతులు జరుగుతాయని తెలిపారు. ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 79897 52675, 9492421401 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# పెరుగుతూ.. తగ్గుతూ..



సరుబుజ్జిలి: తెలికిపెంట బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార నది

- వంశధార గొట్టాబ్యారేజీ వద్ద పెరిగిన వరద
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సాయంత్రానికి తగ్గుముఖం
- గొట్టాబ్యారేజీని పరిశీలించిన వంశధార అధికారులు



హిరమండలం: బ్యారేజ్ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరదనీరు

హిరమండలం: హిరమండలంలోని వంశధార గొట్టాబ్యారేజీలో వరద నీరు బుధవారం ఉదయం ఒక్కసారిగా పెరిగింది. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు వంశధారలో భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టాబ్యారేజీ వద్ద 38.10 మిల్లీమీటర్ల నీటిమట్టం ఉంది. మంగళవారం రాత్రికి సుమారు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా బుధవారం ఉదయం 7 గంటలకు 35,355 క్యూసెక్కులకు చేరింది. 8 గంటల సమయంలో 41,934 క్యూసెక్కులకు పెరగడంతో వంశధార అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మధ్యాహ్నం వరకు 40 వేల క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. వచ్చిన నీటిని 18 గేట్లను 50 సెంటీమీటర్లు మేర పైకి ఎత్తి దిగువకు విడిచిపెట్టినట్లు డీఈ అనిల్‌కుమార్ తెలిపారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 403 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1347 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టామని చెప్పారు. సాయంత్రానికి వరద తగ్గుముఖం పట్టిందన్నారు. సాయంత్రం 4 గంటలకు 30780 క్యూసెక్కులు, ఐదు గంటలకు 28,283 క్యూసెక్కులు, సాయంత్రం ఆరుగంటలకు 27,979 క్యూసెక్కులకు వరద తగ్గినట్లు డీఈ వివరించారు. వరద పరిస్థితిని వంశధార ఈఈ డీఎస్ ప్రదీప్, డీఈ అనిల్‌కుమార్, ఏఈఈలు ధనుంజయరావు, పరిశుద్ధబాబు, పి.శ్రీవాని పరిశీలించారు. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో కాట్రగడ వద్ద 68.2 మిల్లీ మీటర్లు, గుడారి వద్ద 58.4 మిల్లీమీటర్లు, మోహన్ వద్ద 34 మిల్లీ మీటర్లు, గుణుపూర్ వద్ద 29.8 మిల్లీమీటర్లు, మహేంద్రగడలో 16.8 మిల్లీమీటర్లు, కాశీనగర్ 15.8 మిల్లీ మీటర్లు, మెళియాపుట్టి వద్ద 3.6.మిల్లీ మీటర్లు, గొట్ట వద్ద 6.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు డీఈ వివరించారు.

క్లుప్తంగా

### విద్యుత్ ఉద్యోగుల రిలే దీక్షలు ప్రారంభం


దీక్షలు చేపడుతున్న విద్యుత్ ఉద్యోగులు

అరసవల్లి: విద్యుత్ శాఖ ఉద్యోగుల న్యాయమైన 12 డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయం గేటు వద్ద రిలే నిరాహార దీక్షలను జేఏసీ కన్వీనర్ జి.రమేష్, చైర్మన్ ఎం.వి.గోపాలరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు రిలే దీక్షలు చేపడుతున్నామని, మేనేజ్‌మెంట్, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. తొలిరోజు దీక్షలో విద్యుత్ శాఖ ఉద్యోగులు జి.సూర్యచంద్రరెడ్డి, జి.రమేష్, గణేష్, వై.రవికాంత్, ఎ.బాలకృష్ణ, పి.రాంబాబు, సీహెచ్.సంతోష్, బి.వి.వి.సత్యనారాయణ, కె.ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

### ఎలక్ట్రికల్ సామగ్రి చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నిర్మిత కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ నిల్వ ఉంచిన రూ.1.30 లక్షల విలువైన ఎలక్ట్రికల్ సామగ్రి చోరీకి గురైంది. ఈ మేరకు మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉరిటి రాజేంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని జేఆర్‌పురం సీఐ ఆదాం, ఎచ్చెర్ల ఎస్సై సత్యనారాయణ, క్లూస్ టీం బృందం బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు సర్వీస్ వైర్, మీటర్ భద్ర పర్చే బాక్సులు, ఇతర సామగ్రి ఇక్కడ నిల్వ ఉంచారు. తలుపుల తాళాలు తొలగించి ఈ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సంపూర్ణ పోషణ.. ఆరోగ్యానికి రక్షణ

బాలింతలు, గర్భిణుల ఇంటికే పౌష్టికాహారం అందించేందుకు ఉద్దేశించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రారంభమైంది. ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు కిట్లు అందజేశారు. పోషణ కిట్లను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్


శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న జేసీ ఎం.నవీన్


నరసన్నపేట: పెద్దపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో టేక్ హోం రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


ఆమదాలవలస: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, తొగరాం సర్పంచ్ వాణి


కవిటి: నర్తుపుట్టుగలో చిన్నారికి అన్నప్రాశన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


పాతపట్నం: పాతపట్నంలో సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


టెక్కలి: టెక్కలిలో పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి

### విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గార: హైదరాబాద్‌లో ఈ నెల మూడో వారంలో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, విశాఖపట్నం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి రాణా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం శ్రీకూర్మంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా పనిచేస్తున్న మందకృష్ణ మాదిగకు పూర్తి సహకారంతో విశ్వరూప మహాసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ఎంఎస్‌పీ ఇన్‌చార్జి కణితి సాధూరావు, ఒడిశా ఇన్‌చార్జి బోసు, సత్తల కృష్ణ, సుదర్శన్, గోర సురేష్, కవిటి నూకరాజు, వి.సీలయ్య తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శులకు పునశ్చరణ తరగతులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీరాజ్ చట్టాలు, స్థానిక సంస్థలు పాలనపై పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం, మహిళా సాధికారిత కేంద్రాలను జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారులు పి.వి.రాజు, లోకనాథం బుధవారం పరిశీలించారు. సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, విడతల వారీగా శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు.



### ఆటో–బైక్ ఢీ


గాయాలపాలైన శిశిర్ కుమార్ జెన్నా

మెళియాపుట్టి : మండలంలోని చాపర గ్రామంలో బుధవారం సాయంత్రం బైక్.. ఎలక్ట్రికల్ ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చాపర గ్రామానికి చెందిన మధు ఆటోతో పట్టుపురం వైపు నుంచి చాపర గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఒడిశా జంగాలపాడు వైపు వెళుతున్నారు. చాపర గ్రామశివార్లలో పరస్పరం ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ఉన్న అడ్వకేట్లు శిశిర్ కుమార్ జెన్నా, ప్రతాప్ సాములో గాయపడ్డారు. ఇద్దరినీ పర్లాఖిమిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మెళియాపుట్టి పోలీసులకి సమాచారం అందించారు.

### ఆదిత్యుని సన్నిధిలో ఎన్జీవో నేతలు


నేతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర ఎన్జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డిల బృందం బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమ నాయుడు, జిల్లా ఎన్జీవో సంఘ నేతలు, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, హరిప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయం

కవిటి:

ఎమ్మెల్సీగా యాదవ సామాజికవర్గానికి చెందిన తనను ఎంపిక చేసినందుకు బహుమానంగా మనమంతా ఇచ్ఛాపురంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటి మండలం నర్తుపుట్టుగలో బుధవారం జరిగిన పౌరసన్మానసభలో ఆయన మాట్లాడారు. 2024లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అధికశాతం యాదవులు ఇచ్ఛాపురంలోనే ఉన్నారని, ఈసారి ఎన్నికల్లో ఇచ్ఛాపురం స్థానం పదిలం చేసుకొనే దిశగా ఐక్యతగా ముందుకుసాగాలన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి స్వగ్రామానికి విచ్చేసిన రామారావు దంపతులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.


ఎమ్మెల్సీ రామారావు దంపతులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, గ్రామస్తులు

## ఎంఈఓపై సీఆర్‌పీల ఫిర్యాదు

రణస్థలం: పైడి భీమవరం పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న క్లస్టర్ మొబైల్ రిసోర్స్ టీచర్ ఏ.జయలక్ష్మి విధుల పట్ల ఎంఈఓ ఏ.త్రినాథరావు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఆర్‌పీలు ఏ.జయలక్ష్మి, యు.శ్రీనివాసరావు, వై.జి.రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు రణస్థలం మండల కేంద్రం ఎంఈవో–2 లావణ్యకు బుధవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేవారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీబీఏ–1 పేపర్లను సీఆర్‌పీలే అన్ని పాఠశాలల వద్దకు తీసుకెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారని, జాబ్‌చార్ట్‌లో లేని పనులు అప్పగించడం తగదన్నారు. ఈ విషయమై ఎంఈఓ త్రినాథరావును వివరణ కోరగా పేపర్లను సీఆర్‌పీలే పాఠశాలలకు వెళ్లి ఇవ్వాల్సి ఉందని, ఆమె ముందు రోజు పేపర్లు ఇచ్చి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు.

## సవరణ బిల్లు రద్దు చేయాలని వినతి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార ఎస్టీ సాధన సమితి ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు–2023కు సంబంధించి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికను రద్దు చేయాల జిల్లా మత్స్యకార ఎస్టీ సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఏఓ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ బిల్లు వల్ల దేశీయ మత్స్యకారులకు నష్టం కలుగుతుందన్నారు. పర్యావరణానికి హాని లిగించేలా సవరణ బిల్లును వెంటనే నిలుపుదల చేయాలని, మత్స్యకారులు సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది చింతపల్లి సూర్యనారాయణ, మత్స్యకార ఎస్టీ సాధన సమితి గౌరవాధ్యక్షుడు మైలపల్లి పోలీసు, బడియర్రయ్య, మాగుపల్లి అప్పారావు, మైలపల్లి రాము పాల్గొన్నారు.

### జిల్లా జడ్జిగా పదోన్నతి


గొనప షణ్ముఖరావు

కంచిలి : కృష్ణా జిల్లా కైకలూరులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న చిన్నకొజ్జిరియా గ్రామానికి చెందిన గొనప షణ్ముఖరావుకు జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ మేరకు చిన్నకొజ్జిరియా సర్పంచ్ గొనప సీతారాం, గ్రామస్తులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన షణ్ముఖరావు ఇంతటి స్థాయికి ఎదగడం గర్వకారణంగా ఉందన్నారు.

### చెవిటమ్మతల్లి ఆలయంలో చోరీ


తెరిచి ఉన్న హుండీ

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో చెవిటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో హుండీని దుండగులు దోచుకున్నారు. మంగళవారం ఆలయానికి ఉన్న గేటు గజాలను వంచి హుండీలో ఉన్న నగదు, ఆలయంలోని పలు వస్తువులు దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన డి.అప్పారావు ఇంటి తలుపులు సైతం పగలగొట్టినట్లు చెప్పారు.



## విద్యా ఫౌండేషన్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు ప్రసాద్

హిరమండలం: మండలానికి చెందిన విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర స్థాయి ఉత్తమ స్వచ్ఛంద సంస్థ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో బుధవారం మై చాయిసెస్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఎల్కా గ్రోబ్లర్, డైరెక్టర్ వినయ్ చేతుల మీదుగా విద్యా ఫౌండేషన్ అధ్యక్షుడు యూ.ప్రసాద్‌కు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించారు. మానవ అక్రమ రవాణాపై జిల్లా పోలీసులు, బాలల సంరక్షణ సంస్థతో కలిసి ఆపరేష్ రెడ్ అలెర్ట్ అనే కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డు అందుకున్నట్లు ప్రసాద్ తెలిపారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,380–00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,350–00 |
| వెండి (కిలో) | 80,000–00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 475.00 |
| విజయనగరం | రూ. 479.00 |
| శ్రీకాకుళం | రూ. 479.00 |

### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
| ₹120 | ₹210 | ₹ 220 |